# తెలుగు నేర్చుకోవడం భలే తేలిక: అమెరికన్ విద్యార్థి బ్రైస్



"ఏడాది క్రితం తెలుగుతో ఎప్పటికయినా మాట్లాడగలనా అనుకునేవాణ్ని. తెలుగు చాలా కష్టమయిన భాషని, నేర్చుకోవడం చాలా కష్టమనీ అందరూ బెదరగొట్టారు కానీ అదంతా ఒట్టి భయమేనని ఇక్కడ తెలుగు కోర్సు చేశాక అర్థమయింది. ఇవాళ తెలుగు అంటే నాకు అమితమయిన ప్రేమ. వ్యక్తిగతంగా ఇది నాకు గొప్ప విజయం' అని అమెరికన్ విద్యార్థి బ్రైస్ రాబిన్సన్ అన్నాడు. ఆస్టిన్‌లోని టెక్సాస్ యూనివర్సిటీ బిజినెస్ స్కూలులో బ్రైస్ తెలుగు భాషను నేర్చుకున్నాడు. అమెరికాలోని ఏ యూనివర్సిటీలో అయినా అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులో విద్యార్థులు ఒక భాషా కోర్సు చేయాలి. అలా బ్రైస్ దృష్టి తెలుగు భాషపై పడింది.

ఈ ఏడాది ఉత్తమ విద్యార్థులుగా బ్రైస్, పియా కుమార్ ఎలిజబెత్ 'తానా' అవార్డులు గెల్చుకున్నారు. మరో విద్యార్థిని ప్రియా కుమార్ ఎలిజబెత్ నేపథ్యం భిన్నం. ఆమె తండ్రి ఆంధ్ర ప్రదేశ్‌కు, తల్లి లండన్‌కు చెందిన వారు. నాన్నమ్మ వాళ్లతో తెలుగులో మాట్లాడాలన్న పట్టుదలతో టెక్సాస్ వర్సిటీలో తెలుగు నేర్చుకుంది.

ఇటీవల 'తానా', టెక్సాస్ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ఆవుల మంజులత చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకున్నారు. 'తానా' కార్యదర్శి తోటకూర ప్రసాద్ అధ్యతన జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తెలుగు భాషాభిమానులు హాజరయ్యారు. ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి, ఆస్టిన్ తెలుగు ప్రముఖులు ఎస్.ఎస్. రామారావు, శానాంటొనియో సంఘం తరపున గోవిందరాజు మాధవరావు, డల్లాస్ నుంచి రమణ తదితరులు ఈ సభలో పాల్గొన్నారు.

జనవరిలో తెలుగు సినిమా పండుగ

టెక్సాస్ క్యాంపస్‌లో తెలుగు భాష, సంస్కృతులపై అవగాహన పెంచడానికి వచ్చే జనవరిలో చివరివారంలో 'తెలుగు సినిమా పండుగ' నిర్వహిస్తున్నామని టెక్సాస్ భారతీయ విద్యార్థి ప్రతినిధులు అనుమప అట్లూరు, మనోజ్ మిక్కిలినేని, హర్ష ఓరుగంటి, రమ్య ముద్దసాని, దీపికా ముత్యాల తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు భాష చరిత్ర, సంస్కృతినీ ప్రతిబించే పది చలన చిత్రాలను ప్రదర్శిస్తామన్నారు. తెలుగు సినిమా చరిత్ర, ధోరణుల మీద ప్రసంగాలు, చర్చలు నిర్వహిస్తామన్నారు.